95 శాతం వరి నాట్లు పూర్తి

- రెండు రకాల సాగుపైనే రైతుల మక్కువ
- ఎండలు, నీటి ఎద్దడితో పనులు ఆలస్యం



కడియంలో నాట్లు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ద్వారకాదేవి తదితరులు

కడియం: మండల పరిధిలో 95శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. మండలంలోని వేమగిరి, కడియం, కడియపుసావరం, మురమండ, జేగురుపాడు, దుళ్ల గ్రామాల్లో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగవుతోంది. సాగు విస్తీర్ణంలో సుమారు 75 శాతం వరకు స్వర్ణ (ఎంటీయూ 7029) రకానికే రైతులు మొగ్గు చూపారు. ప్రత్యామ్నాయ వరి రకాల గురించి రైతులకు అధికారులు వివరించినప్పటికీ అధికశాత రైతులు స్వర్ణవైపే మొగ్గు చూపారు. తొలకరి సీజన్‌లో కడియం ఆవ ముంపునకు గురవుతుంటుంది. దీంతో ఈ ప్రాంతంలో ముంపును తట్టుకునే రకమైన ఎంటీయూ 1318 రకాన్ని రైతులు సాగు చేస్తున్నారు. అలాగే కడియపుసావరం పరిధిలోని రైతులు కూడా 1318 రకానికే మొగ్గు చూపారు. సాగు విస్తీర్ణంలో ఈ రకం దాదాపు 20శాతంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మెరక చేలు, రైతుల ఆసక్తి మేరకు ఐదుశాతం మంది వివిధ రకాల వరి సాగు చేపట్టారని వివరించారు.

ఇతర ప్రాంతాల వారే..

వరి ఊడ్పుల సమయంలో ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి కూలీలు వస్తుంటారు. దాదాపు ఆరేడేళ్లుగా ఇది కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా బెంగాల్ ప్రాంతం నుంచే కాకుండా, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు చెందిన కూలీలు ఊడ్పులకు తరలివచ్చారు. కడియం, మురమండ, మాధవరాయుడు పాలెం, దుళ్ల తదితర చోట్ల మకాంలు ఏర్పాటు చేసుకుని నెల రోజులుగా ముమ్మరంగా వరి పొలాల్లో నాట్లు వేస్తున్నారు. తీవ్రమైన ఎండల కారణంగాను, నీటి ఎద్దడి తదితర కారణాలతో నిర్ణీత సమయానికంటే ఆలస్యంగా ఊడ్పులు ప్రారంభమయ్యాయి. అయితే వలస కూలీలు వేగం పనిచేసిన కారణంగా నిర్దేశించిన సమయానికే కడియం మండలంలో ఊడ్పులను పూర్తి చేయగలిగామని పలువురు రైతులు తెలిపారు.


స్వర్ణ రకమే ఎక్కువ..



కడియం మండలం పరిధిలో వరి సాగు విస్తీర్ణంలో స్వర్ణం రకమే ఎక్కువ. ప్రతి ఏడాది మాదిరిగానే రైతులు స్వర్ణవైపే మొగ్గు చూపారు. సాగులో దాదాపు 70శాతానికిపైగా ఈ రకం ఉంటుంది. 1318 రకం ఇరవైశాతం, సన్నరకాలు ఏడెనిమిది శాతం వరకు ఉంటాయి. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 95శాతం వరకు ఊడ్పులు పూర్తయ్యాయి. వర్షాల తెరిపిస్తే ఒకటి రెండు రోజుల్లోనే నూరుశాతం నాట్లు పూర్తవుతాయి.

– కె.ద్వారకాదేవి, మండల వ్యవసాయాధికారి, కడియం

వేగంగా నాట్లు



వరిలో స్వర్ణ రకం సాగువైపే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతారు. ఒక మోస్తరు ముంపును తట్టుకోవడం, తడిసినా మొలక వెంటనే రాకపోవడం తదితర లక్షణాల కారణంగా రైతుల స్వర్ణ సాగుకు ఆసక్తి చూపిస్తారు. ఈ ఏడాది కూడా వలస కూలీల రాకతో నాట్లు వేగంగా సాగాయి. నారు తీయడం, నాట్లు వేయడానికి ఎకరాకు రూ. 3,500 నుంచి రూ. 4,000ల వరకు తీసుకుని నాట్లు పూర్తి చేశారు.

–బొమ్మిరెడ్డి వెంకట్రావు, కడియం

కేసు ఎందుకు కట్టలేదు?

రచ్చబండలో త్రీ టౌన్ సీఐని ప్రశ్నించిన ఎంపీ భరత్



త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: హత్య కేసు విషయంలో పూర్తి విచారణ జరిపి..న్యాయం చేయమంటే ఎందుకు ఇప్పటి వరకూ స్పందించలేదని రాజమహేంద్రవరం త్రీ టౌన్ సీఐపై రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నించారు. స్థానిక వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో గల ఎంపీ కార్యాలయ ఆవరణలో 'రచ్చబండ' కార్యక్రమాన్ని ఎంపీ భరత్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'తమకు న్యాయం జరగలేదు బాబూ..' అంటూ వృద్ధ దంపతులు ఎంపీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. సుబ్బారావునగర్‌లో ఒక కుటుంబాన్ని ఆ ఇంటికి ఎదురుగా నివాసం ఉంటున్న లారీడ్రైవర్ పరుష పదజాలంతో దూషిస్తూ తండ్రిపైనా, కొడుకుపైనా దాడి చేశాడని ఎంపీ భరత్‌కు ఇటీవల నిర్వహించిన రచ్చబండలో బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీ వెంటనే త్రీ టౌన్ సీఐకు ఫోన్ చేయడంతో ఆయన కూడా రచ్చబండకు వచ్చారు. బాధితుల ఆవేదనను విన్నారు. అసలు కొట్టవలసిన పని ఏమొచ్చింది..వీరి కుమారుడు చావుబతుకుల మధ్య ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నాడు. వెంటనే హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయమని ఎంపీ భరత్ సీఐకు తెలిపారు. అయితే ఆ బాధిత దంపతులు మంగళవారం రచ్చబండలో పోలీసులు కేసు కట్టలేదని ఎంపీకి చెప్పారు. దీంతో ఎంపీ త్రీ టౌన్ సీఐకు ఫోన్ చేసి హత్యాయత్నం కేసు ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో వెనుకంజ వేస్తే..ప్రభుత్వానికే చెడ్డ పేరు వస్తుందన్నారు. రచ్చబండలో వచ్చిన 90 శాతం సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. మిగిలిన పది శాతం అర్జీలను ఆయా శాఖల అధికారులకు పరిశీలన నిమిత్తం పంపించనున్నట్టు ఎంపీ భరత్ తెలిపారు. అర్బన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మణికాంత్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: చోరీ కేసులో తన భర్త మృతి చెందిన సంఘటనపై విచారణ జరపాలని రాజమహేంద్రవరానికి చెందిన మృతుని భార్య పట్నాల నాగమణి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానికులు, మృతుడి భార్య, పోలీసుల కథనం ప్రకారం రాజమహేంద్రవరం సీతంపేట ఎన్టీఆర్ కాలనీకి చెందిన పట్నాల మణికాంత్(35) అలియాస్ మణికంత, ఆటోమణి ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతడు టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసుకు అనుచరుడు. ఈ నెల 11న చోరీ కేసులో మణికాంత్‌ను తణుకు రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దొంగిలించిన బంగారం రికవరీ చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్ ఇచ్చి ఈ నెల 17వ తేదీన ఇంటికి పంపించారు. అప్పటి నుంచి మణికాంత్ అధికంగా మద్యం సేవించాడు. అనారోగ్యంగా ఉండడంతో అతడిని ఈ నెల 24వ తేదీ రాత్రి భార్య నాగమణి రాజమహేంద్రవరంలోని స్వతంత్ర జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించింది. అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ఆందోళనకు దిగారు. తర్వాత పోలీసులు సర్దిచెప్పారు. నాగమణి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసుగా త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు నమోదు చేశారు.

పేదల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



వెంకాయమ్మపేటలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తున్న కో ఆర్డినేటర్ నాగేశ్వర్. చిత్రంలో పార్టీ నాయకులు

రూరల్ కో– ఆర్డినేటర్ నాగేశ్వర్

కడియం: పేదలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కడియపులంక పంచాయతీ పరిధిలోని వెంకాయమ్మపేట (సచివాలయం 4)లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చందన నాగేశ్వర్ ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వివిధ పథకాలతో కూడిన బ్రోచర్‌లను ప్రజలకు అందజేశారు. అంతకుముందు స్థానిక వలంటీర్లతో మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైన్‌లు, విద్యుత్, తాగునీరు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలు ఎవరికైనా అందకపోతే, అవి ఎందుకు అందలేదన్న దానిపై క్షేత్రస్థాయిలో నాయకులు, అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఇటువంటి వారిని గుర్తించి, వారికి ఆయా సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, కడియపులంక సొసైటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, అయితరెడ్డి వెంకటస్వామి, బోడపాటి సత్యనారాయణ, గండి రమణ, కూసి సూర్యనారాయణ పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్దలో పోషకాలు



రాగి జావ పంపిణీ చేస్తున్న డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు: ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద పూర్తి పోషకాలతో కూడి ఆరోగ్యమైనదని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక డీఎంహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న రాగి జావను ఆయన మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు వేరుశనగ చిక్కి, మూడు రోజులు రాగి జావను అందిస్తున్నామన్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.రాజా ప్రశాంత్, స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి పరస జగన్నాథరావు, సీఆర్పీ జయంతి శాస్త్రి పాల్గొన్నారు.

అకడమిక్ కేలండర్ ప్రకారం బోధన

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ప్రతినెలా 28, 29 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక డీఎంహెచ్ స్కూల్‌లో జరుగుతున్న ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన మంగళవారం హాజరయ్యారు. డీఐ మాట్లాడుతూ అకడమిక్ కేలండర్ ప్రకారం పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర విద్యా శిక్షణ సంస్థ యూ ట్యూబ్ ద్వారా ప్రసారం చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన లైవ్‌లో వీక్షించారు. వివిధ పాఠశాలల నుంచి 33 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి జ్యోతి



కోలమూరు గ్రామ సచివాలయం–2లో సర్టిఫికెట్‌ను అందజేస్తున్న అధికారులు, సచివాలయ కన్వీనర్లు

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని మండల ప్రత్యేకాధికారి, జిల్లాగిరిజన సంక్షేమాధికారిణి కేఎన్ జ్యోతి అన్నారు. మంగళవారం బొమ్మూరు గ్రామసచివాలయం–3 జగనన్న సురక్ష కార్యక్రమం ఏఎంజీ ఆడిటోరియంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. వివిధ రకాల సర్టిఫికెట్లు లబ్ధిదారులకు కేఎన్.జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ తాటికొండవిష్ణు, సచివాలయ కన్వీనర్లు ముద్దాలఅను, మరడాపుశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. ప్రజలకు వివిధ పథకాల సేవల గురించి వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తమకు మేలు జరిగిందని పలువురు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దాకేశ్రీను, పార్టీనాయకులు యెనుముల త్యాగరాజు, కేవీ సుబ్బారెడ్డి, మత్స్యేటిశివ, సోమన శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోలమూరులో..

కోలమూరు గ్రామసచివాలయం–3లో జగనన్న సురక్ష కార్యక్రమం మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. వివిధ రకాల 2604 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణు, సచివాలయ కన్వీనర్లు షేక్‌చానా, ఆనెంశ్రీనివాస్, సోమిరెడ్డి సత్తిబాబు చేతులమీదుగా అందించారు. మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి, పార్టీనాయకులు చెరుకూరి సత్తిబాబు, పరిమి దుర్గారావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రియదర్శినికి ఇన్వర్టర్ బహూకరణ



ప్రియదర్శిని ఆశ్రమానికి ఇన్వర్టర్ బహూకరిస్తున్న జేసుదాస్

కంబాలచెరువు: స్థానిక మున్సిపల్ కాలనీలో నున్న ప్రియదర్శిని చెవిటి, మూగ పిల్లల ఆశ్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త జేసుదాస్ ఇన్వర్టర్‌ను మంగళవారం బహూకరించారు. ఆశ్రమంలో విద్యుత్ అంతరాయం వచ్చినప్పుడు పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిసిన జేసుదాస్ వెంటనే తమకు ఇన్వర్టర్ అందజేశారని కరస్పాండెంట్ స్వప్నవర్మ తెలిపారు. ఆశ్రమ ప్రిన్సిపాల్ కె.ఆశాలత, ప్రేమలత, నిర్మల, ఎలిషారాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ

కడియం: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మండలంలో దుళ్ల నెం.1 ప్రాథమిక పాఠశాలకు ఒకటి, శ్రీ పోలేరమ్మ అమ్మవారికి ఆలయానికి 1 సీలింగ్‌ఫ్యాన్‌ను మంగళవారం అందజేశారు. స్కూలు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వాసవీ క్లబ్ గవర్నర్ మండవల్లి మురళీకృష్ణకుమార్, కొమ్మూరి సుభాష్, కొనగళ్ళ రాజా, వెత్స సత్యనారాయణ, కందుకూరి నారాయణ గుప్త, వెంట్రాప్రగడ సత్తిరాజు, నేతి మహాలక్ష్మి పాల్గొన్నారు.

మణిపూర్‌లో దాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



హుకుంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న యూసీఎఫ్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: యునైటెడ్ క్రిస్టియన్ ఫెల్లోషిప్ (యూసీఎఫ్) హుకుంపేట ఆధ్వర్యంలో హుకుంపేట, పిడింగొయ్యి గ్రామాల్లో వున్న 15 క్రైస్తవ సంఘాలు ఐక్యంగా కలసి మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై హింసలకు నిరసనగా ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. బాధితులైన కుకీస్, నాగా జాతులకు ముఖ్యంగా క్రైస్తవులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. దళిత క్రైస్తవ నాయకుడు నక్క విజయకుమార్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్‌కుమార్, రాజమండ్రి సెయింట్ పీటర్స్ చర్చి సంఘ పెద్దలు, పాస్టర్స్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రం బాధ్యత వహించాలి

కంబాలచెరువు: మణిపూర్‌లో జరుగుతున్న అమానుష దాడులకు కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.అరుణకుమారి డిమాండ్ చేశారు. సంఘం నేతృత్వంలో కంబాలచెరువు వద్ద మంగళవారం భారీ నిరసన నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, అధ్యక్షుడు పి.జయకర్ అధ్యక్షతన కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

రాజీనామా చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని దహించు అగ్ని మినిస్ట్రీ వ్యవస్థాపకుడు డాక్టర్ వి.థామస్ డిమాండ్ చేశారు. మంగళవారం తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన పాస్టర్లు థామస్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగినవి జాతుల మధ్య కలహాలు కాదని, క్రైస్తవులపై జరిగిన దాడులని లోకమంతటికీ అర్థమైందని అన్నారు. మూడు జిల్లాలకు చెందిన పాస్టర్లు క్రైస్తవ విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రూ.60వేల చోరీ

రాజమహేంద్రవరం రూరల్: గుర్తుతెలియని వ్యక్తులు తన జేబులోని రూ.6వేలు, క్యాబిన్‌లోని రూ.54వేలు తీసుకుని పరారయ్యారని తమిళనాడు రాష్ట్రం శివకాశి ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ అనంతం మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతం తమిళనాడు ప్రాంతం నుంచి అగ్గిపెట్టెలు, పేపరుకప్పు మెటీరియల్ వేసుకుని సోమవారం తేదీ తెల్లవారుజామున రాజమహేంద్రవరం చేరుకున్నాడు. గోదావరి గట్టు మార్కండేయస్వామిగుడి సమీపంలో అగ్గిపెట్టెలు లోడు దించాడు. సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఆటోనగర్ ఆంజనేయస్వామిగుడి వద్ద లారీ ఆపి భోజనానికి వెళ్లి తిరిగివచ్చి నిద్రించాడు. తెల్లవారుజాము రెండుగంటల సమయంలో లారీ క్యాబిన్ తలుపుతీయగా తన జేబులోని రూ.6వేలు, క్యాబిన్‌లో రూ.54వేలు నగదును గుర్తుతెలియనివ్యక్తులు చోరీచేసి పరారయ్యారని గుర్తించి, పోలీసులకు ఫిర్యాదులో చేశాడు. బొమ్మూరు ఎస్ఐ జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తగిన విధంగా బుద్ధి చెబుతాం

ప్రకాశం నగర్ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై ఇష్టం వచ్చినట్లు నోరుపారేసుకుంటే తగిన విధంగా బుద్ధి చెబుతామని జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ హెచ్చరించారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి జోగి రమేష్ పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేస్తుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊరుకోవడం సరికాదన్నారు.

జగన్‌తోనే ప్రజా సంక్షేమం

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- లాలాచెరువు మార్కెట్ రోడ్డులో గడప గడపకూ..



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ నగర కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం 48వ డివిజన్ లాలాచెరువు మార్కెట్ వద్ద వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి అర్జరపు వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని, తక్షణమే పరిష్కరించే చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజా సంక్షేమ పాలన అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించాలని డాక్టర్ గూడూరి ప్రజలను కోరారు. ఈ సందర్భంగా డ్రెయినేజీ సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే నగర పాలక సంస్థ అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించి చర్యలు చేపట్టాలని కోరారు. సంజీవనగర్ మదర్ థెరిసా విగ్రహం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, కొత్త విజయ రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు, ఎలక్ట్రికల్ ఏఈ డి.రవికుమార్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కడియపులంకలో చందన పర్యటన



కడియపులంకలో డ్రైన్ పనులు పరిశీలిస్తున్న చందన

కడియం: ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, రూరల్ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మంగళవారం కడియపులంకలో పర్యటించారు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వర్షాకాలంలో ముంపు సమస్య కారణంగా స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం చందన దృష్టికి స్థానిక నాయకులు తీసుకువెళ్లారు. దీంతో రూ.16 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులను చందన పరిశీలించి పలు సూచనలు చేశారు. తాడాల చక్రవర్తి, ఈలి గోపాలం, తిరుమలశెట్టి శ్రీను, ఊటుకూరి శైలజ, బోడపాటి సత్యనారాయణ, కొత్తపల్లి మూర్తి, బోడపాటి మూర్తి, వాసు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో మెరుగైన సేవలు

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని నాగేశ్వర్ అన్నారు. మండల కేంద్రమైన కడియంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. గిరజాల కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చందన మాట్లాడుతూ మంగళవారం ఒక్క రోజే కడియం గ్రామంలో 1,256 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, జిల్లా ఉద్యానశాఖాధికారి వి.రాధాకృష్ణ, ఎంపీడీవో కె.రత్నకుమారి, జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణు చక్రవర్తి, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, స్థానిక నాయకులు గిరజాల నాగేశ్వరరావు, సాకా పట్టాభి, పెంకే రామకృష్ణ, సర్కార్‌బాషా పాల్గొన్నారు.

మహిళా బిల్లు పెట్టాలి



పార్లమెంట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న డాక్టర్ అనసూరి పద్మలత. చిత్రంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాజమహేంద్రవరం సిటీ: పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టి బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించినపుడే బీసీ మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందని జాతీయ బీసీ మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత , రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలకు చెందిన బీసీ ప్రతినిధులతో పార్లమెంట్ వద్ద నిర్వహించిన భారీ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ పద్మలత మాట్లాడుతూ మహిళ బిల్లులో రాజకీయ రిజర్వేషన్లతో పాటు విద్యా,ఉద్యోగాలలో కూడా 50 శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

20 కేజీల గంజాయి స్వాధీనం

కడియం: మండలం వెంకాయమ్మపేట వద్ద మంగళవారం 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి మోటారు సైకిల్‌పై పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందినవారు ఈ సరకు తరలిస్తున్నారు. సమాచారం తెలిసిన పోలీస్‌లు తనిఖీలు చేపట్టగా వెంకాయమ్మపేట వద్ద గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన మర్రి శామ్యూల్, పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన పోలంగి సుబ్బరాజు, విజయవాడ చిట్టినగర్‌కు చెందిన షేక్ నిరీక్షణ్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 కేజీల గంజాయి, 20 వేలు నగదు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తెలిపారు. వీరు కోనాల్ అనిల్‌సాయి సంతోష్‌రెడ్డితో కలసి గతంలో హైవేల పక్కన ఆగి ఉన్న లారీల్లో డ్రైవర్‌లు నిద్రలో ఉండగా వారి సెల్‌ఫోన్‌లు, డబ్బులను దొంగిలించేవారని వివరించారు.

బాలిక అదృశ్యం

కడియం: మండలం జేగురుపాడు గ్రామానికి చెందిన బాలిక కన్పించడం లేదని ఆమె తండ్రి కడియం పోలీస్‌లకు మంగళవారం ఫిర్యాదు చేశారు. రాత్రి తమతోపాటే ఇంట్లో నిద్రించిందని, ఉదయం లేచి చూసే సరికి లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ శివాజీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తు చేయండి

రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉభయ తెలుగు రాష్ట్రాలలోని మారుమూల గ్రామాలలో మట్టిలో మాణిక్యాల్లాగా దాగి వున్న సమాజ సేవకుల, ఉపాధ్యాయుల, వైద్యుల, కళాకారుల, కవుల, రచయితల, .క్రీడాకారులు, విద్యావంతుల, కార్మికుల, కర్షకుల సేవలను, ప్రతిభను గుర్తించి జాతీయ స్థాయి పురస్కారాలు అందించే ఏర్పాటు చేసినట్లు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ నారాయణ మాస్టారు తెలిపారు. మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ) హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అర్హత కలిగిన వారంతా ఆగస్టు 5వ తేదీలోపు సర్టిఫికెట్స్, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్ పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుకు జతచేసి ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమి, డోర్ నెం .1–20–164, గోకుల్ నగర్, వెంకటాపురం, పోస్టు: తిరుమలగిరి, సికింద్రాబాద్ – 15 అడ్రస్‌కు పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు 9652347207 నంబరులో సంప్రదించాలన్నారు.

ఆంధ్రకేసరి పార్కును సుందరంగా తీర్చిదిద్దాలి

రాజమహేంద్రవరం సిటీ: పరమహంస యోగానంద మార్గ్‌లో ఆధునీకరిస్తున్న ఆంధ్రకేసరి పార్కును అన్ని వసతులతో తీర్చిదిద్దాలని ఇంజినీరింగు అధికారులకు కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆంధ్రకేసరి పార్కు అభివృద్ధి పనులను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ పార్కులో ఉన్న చెట్లను తొలగించకుండా వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, కూర్చోవడానికి వివిధ రకాల బెంచీలు, నాలుగు ఫుడ్ ఔట్‌లెట్లు సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ పార్కులో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠిస్తామన్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యాయని, ఫుడ్ ఔట్ లెట్ల నిర్వహణకు సంబంధించిన టెండర్లు పిలిచామని పారదర్శకమైన ప్రక్రియతో ఔట్‌లెట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. మొదట వాకింగ్ ట్రాక్‌ను ఆగస్టులో ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీరు జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ప్రకాశరావు పాల్గొన్నారు.

వైభవంగా కన్నమాంబ పేరంటలమ్మ జాతర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలకసంస్థ పరిధిలోని 16వ డివిజన్ బాలాజీపేట, ఆదర్శనగర్‌లోని శ్రీశ్రీశ్రీకన్నమాంబ పేరంటలమ్మవారి జాతర మహోత్సవాలు వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఉత్సవ కమిటీ నేతృత్వంలో అమ్మవారి చల్లఘటాలను ఊరేగించారు. గరగ నృత్యాలు, వికాళికాదేవి, కాంతారా, శివుని వేషధారణ భక్తులను అలరించాయి. అమ్మవారిని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, ఆర్‌జే రాజేష్ దర్శించుకున్నారు.

ఇలా వాడేస్తున్నారు!



రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పేషెంట్లు వినియోగించాల్సిన స్ట్రెచ్చర్‌ను ఆసుపత్రి సిబ్బంది వివిధ పనులకు వినియోగిస్తున్నారు. పాడైపోయిన ట్యూబ్‌లు, ఫ్యాన్‌లను స్ట్రెచ్చర్‌పై వేసుకుని తీసుకువెళుతున్నారు. పేషెంట్ల కోసం వినియోగించాల్సిన స్ట్రెచ్చర్‌లను ఇలా వినియోగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. –ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)